అర్హులను గుర్తించడమే జగనన్న సురక్ష లక్ష్యం


పులివెందులలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్


వేములలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీ

పులివెందుల టౌన్ : అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలను అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని పెద్దకొండప్ప కాలనీలోని వార్డు సచివాలయంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పులివెందుల పట్టణాన్ని మోడల్ టౌన్‌గా ప్రకటించి కోట్లాది రూపాయలు పట్టణాభివృద్ధికి మంజూరు చేశారన్నారు. సచివాలయ పరిధిలో ఎవరైనా మేము ప్రభుత్వ పథకాలకు అర్హులమైనా మాకు ప్రభుత్వ పథకాలు అందలేదని వస్తే తమ దృష్టికి తేవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2023 అవార్డు తీసుకోవడమే తమ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా 1876 కుల, ఆదాయ, జనన, వివాహ ఇతర 11రకాల ధృవీకరణ పత్రాలను ప్రజలకు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు గుల్జార్, లక్ష్మీభార్గవి, శ్యామలాదేవి, కొండ్రావు, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్, జగనన్న కన్వీనర్లు, గృహ సారథుల ఇన్‌చార్జి చంద్రమౌళి, డిప్యూటీ తహసీల్దార్ వీరశేఖర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని మురారిచింతల గ్రామ సచివాలయంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్ పాల్గొని మాట్లాడారు. సచివాలయ పరిధిలోని మురారిచింతల, గుణకణపల్లె, దిగువపల్లె గ్రామాల్లో వలంటీర్లు గడప గడపకు వెళ్లి జగనన్న సురక్ష సర్వే నిర్వహించారన్నారు. ఈ సర్వేలో ప్రజల నుంచి 298 వినతులు అందాయన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు వివిధ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ త్రిభువన్‌రెడ్డి, మురారిచింతల సర్పంచ్ షాహీరా, ఉప సర్పంచ్ సంతోష్‌రెడ్డి, గుణకణపల్లె ఉప సర్పంచ్ సూర్య నారాయణరెడ్డి, ఎంపీటీసీ శేఖర్, ఆర్‌ఐ సురేంద్ర, సచివాలయ కన్వీనర్ బాబా హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని బురుజుపల్లె గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీఓ నాగప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు కుమ్మెత చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని 435 మందికి ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి, డీటీ మీనా, ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి, ఏపీఎం ఓబులేసు, ఇన్‌చార్జి ఈఓఆర్డీ సుబ్రమణ్యం పాల్గొన్నారు

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాతసంగటిపల్లెలో గురువారం జగనన్న సురక్ష పథకం ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు పంపిణీ చేసి ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భాస్కర్, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, సర్పంచ్ సుజాత, ఎంఈఓ సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక 6వ సచివాలయంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి పాల్గొని మాట్లాడారు. మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలనీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు పలు కుల, ఆదాయ, జనన, వివాహ ఇతర ధృవీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ భారతి, వార్డు సభ్యులు నరసింహగౌడ్, సునీల్, నాయకుడు కె.ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లెలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, పీసీబీ రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డిలు పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దకే అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఎంపీటీసీ మల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ వర్రా రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎక్కడ ఉన్నా వెళ్లి పింఛన్ అందజేస్తున్నాడు..

వీరపునాయునిపల్లె మండలం ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన వలంటీర్ గంగన్న పింఛన్ దారులు ఎక్కడ ఉన్నా తెలుసుకుని మరి అక్కడికి వెళ్లి పింఛన్ అందజేస్తున్నాడు. ఇతనికి కేటాయించిన 50 ఇళ్లలోని లబ్ధిదారుల అవసరాలను గుర్తించి అధికారులకు సమాచారాన్ని చేరవేస్తూ వారి సమస్యలను తీర్చుతున్నాడు. ప్రతి నెలా 1వ తేదీ పింఛన్ పంపిణీ చేయడంలో చురుగ్గా ఉంటున్నాడు. -వీర పునాయునిపల్లె


పుల్లయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గంగన్న

వలంటీర్‌ల సేవలు అద్భుతం



నాపేరు కొండబోయిన పుల్లయ్య, మాది ఓబుల్‌రెడ్డిపల్లె. మా వలంటీర్ గంగన్న ప్రభుత్వం తరపున ఏ సమాచారం అందిన వెంటనే మాకు తెలియజేయడంతో పాటు ఎక్కడ ఉన్నా తెలుసుకుని పింఛన్ అదించేవాడు. గత ప్రభుత్వం ఏ పథకాలు అమలు చేస్తోందో తెలిసేవి కాదు. ఇప్పుడు వలంటీర్ల ద్వారా సమాచారం అందుతోంది.- **కొండబోయిన పుల్లయ్య, ఓబుల్‌రెడ్డిపల్లె.**

మనవడిలా సేవ చేస్తున్నాడు...


వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న శివశంకర్

ఇతని పేరు శివశంకర్, చింతకొమ్మదిన్నె మండలం రసూల్‌పల్లి. సచివాలయ పరిధిలోని కొత్తపేట గ్రామంలో గ్రామ వలంటీర్‌గా సేవలు అందిస్తున్నాడు. గత నాలుగేళ్లుగా జగనన్న ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలను లబ్ధిదారుల దరికి చేర్చాడు. కుటుంబ సభ్యుడిలా వారికి ఏ పని కావాలన్నా చేసి పెడుతున్నాడు. కరోనా సమయంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేయడంతో పాటు ప్రతి కుటుంబానికి దగ్గర ఉండి నిత్యావసర సరుకులను అందించి అందరి మన్ననలు పొందాడు. - వీఎన్‌పల్లె

ఇంటిలో వ్యక్తిలా..



నాపేరు కొరముట్ల నాగమ్మ, మాది కొత్తపేట గ్రామం. మా వలంటీర్ శివశంకర్ ఇంటిలో వ్యక్తిలా మాలోకలిసి పోయాడు. నేడు నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని. ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ పనులు చేసి పెడుతున్నాడు. గతంలో పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయేదాన్ని. ప్రస్తుతం ప్రతి నెల ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నాడు. ఆరోగ్యం సరిగ్గా లేకపోతే 104 వాహనం దగ్గరకు తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నాడు. నా నుంచి ఒక్క రూపాయి కూడా ఆశించకుండా మనవడివలా పని చేస్తున్నాడు. **కొరముట్ల నాగమ్మ.**

క్లుప్తంగా

రేపు ఫార్మర్ సైంటిస్ట్ కోర్సు ప్రారంభం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఏపీ కార్ల్ భవనంలో శనివారం రైతు సాధికారిక సంస్థ ఫార్మర్ సైంటిస్ట్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త సుశీల తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఒక రైతు శాస్త్రవేత్తను నియమించి అన్ని గ్రామాలను పర్యావరణ అనుకూలంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు సాధికారిక సంస్థ ద్వారా రైతు శాస్త్రవేత్తలను తయారు చేస్తోందన్నారు. గ్రామస్థాయిలో రైతు శాస్త్రవేత్తలను ఏర్పాటు చేయాలనే ఆలోచన దేశంలోనే ప్రప్రథమంగా ఈ కోర్సును ప్రారంభించడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైఎస్సార్ కాపు నేస్తానికి దరఖాస్తు చేసుకోండి

చక్రాయపేట : వైఎస్సార్ కాపు నేస్తం పథకానికి ఏపీ మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని.. కాపు, బలిజ, తెలగ, ఒంటరి మహిళలందరూ దరఖాస్తులు చేసుకోవాలని కాపునాడు కడప పార్లమెంటరీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సంగా హేమలత తెలిపారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు మహిళందరూ ఈ పథకానికి అర్హులన్నారు. కుటుంబ ఆదాయం రూ.10వేల లోపు ఉండాలని.. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షన్ పొందువారు, ఆదాయ పన్ను చెల్లించేవారు అనర్హులన్నారు. అవసరమైన కుల, ఆదాయ సర్టిఫికెట్లను మీ గ్రామ సచివాలయంలో కానీ, జగనన్న సురక్ష కార్యక్రమాలలో ఉచితంగా పొందవచ్చునన్నారు. ఈనెల 22వ తేదీలోపు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

నవధాన్యాల సాగు పరిశీలన

సింహాద్రిపురం : స్థానిక రైతు పి.వెంకటకిశోర్ చీనీ తోటలో సాగు చేసిన నవధాన్యాల సాగును గురువారం ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కె.వెంకట్రామిరెడ్డి పరిశీలించి మాట్లాడారు. నవధాన్యాల సాగు చేయడంవల్ల భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతుందని.. వానపాములు వృద్ధి చెందడంతోపాటు ఎక్కువ తేమ శాతం పెరుగుతుందన్నారు. పశువులకు మేతతోపాటు రైతు కుటుంబానికి కొంత మేర ఆదాయం వస్తుందన్నారు. ఎన్‌ఎఫ్‌ఎంటీ యూనిట్ ఇన్‌చార్జి రామకృష్ణ, ఐసీఆర్పీ వి.సునీత, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల రూరల్ : ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య ప్రజలకు సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా దోమల నివారణ కొరకు పైరెత్రం పిచికారి చేసి ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నిల్వలు ఉన్న నీటి తొట్లల్లో అబైట్ పిచికారి చేసి మలేరియా, డెంగీ వ్యాధుల అవగాహన కొరకు ర్యాలీ నిర్వహించారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా తయారు చేయాలి

జమ్మలమడుగు : అధికారులు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికీ వెళ్లి కచ్చితమైన ఓటర్ల జాబితా తయారు చేయాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, మండలస్థాయి అధికారులతో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ ప్రక్రియ వేగవంతంపై ఆయన సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబంలో ఉన్న ఓటర్లను మాత్రమే నమోదు చేయాలన్నారు. బయటి ప్రాంతాలలో ఉన్న వారిని ,మరణించిన వారిని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి వివరాలను సేకరించి ఓటర్ల జాబితా నుంచి తొలగించే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. జూలై 21వ తేదీ నుంచి ఆగస్టు వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు.

ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుంటాం

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుంటామని సిర్రాజుపల్లెలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అంతేకాక ఏ గ్రామంలో చూసినా గ్రామ సచివాలయం , ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, డిజిటల్ లైబ్రరీలు నిర్మించారన్నారు. గత ప్రభుత్వ హయంలో ఏ పథకం కావాలన్నా టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేందన్నారు. పథకాల కోసం ముడుపులు సమర్పించుకోవాల్సి వచ్చేదన్నారు. జగనన్న పాలనలో వలంటీర్ల ద్వారా ఎవరి ప్రమేయం లేకుండా ఇళ్ల వద్దే పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగసుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రామలక్షుమ్మ, పార్టీ నాయకులు ఇతరలు పాల్గొన్నారు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


కమలాపురం గరల్స్ హైస్కూల్‌లో విద్యార్థులతో కలసి పాఠాలు వింటున్న డీఈఓ రాఘవరెడ్డి

కమలాపురం : పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం పట్టణంలోని జడ్పీ బాయ్స్, గరల్స్ హైస్కూల్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులు చేసే బోధనా పద్ధతులను పరిశీలించారు. టీచర్స్ డైరీలు, లెసన్ ప్లాన్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి సిలబస్ డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. జనవరి నుంచి రివిజన్, స్లిప్ టెస్ట్ నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల గుర్తింపునకు ప్రశస్త్ యాప్


మొబైళ్లలో ప్రశస్త్ యాప్‌ను చూపిస్తున్న ఐఈ కోఆర్డినేటర్ కేశవరెడ్డి, తదితరులు

వేంపల్లె : ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారి సమగ్ర వివరాలను నమోదు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎన్‌సీఈఆర్టీ) వారు రూపొందించిన ప్రశస్త్ యాప్‌లో ఉపాధ్యాయులందరూ నమోదు చేయాలని ఐఈ కోఆర్డినేటర్ కేశవరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. మండలంలోని పాఠశాలల్లో 130 మంది ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించడం జరిగిందని.. ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్లు ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రత్యేక అవసరాల గల పిల్లల వివరాలు అందులో పొందుపరచాలన్నారు. అదేవిధంగా దివ్యాంగుల సర్వే ఈనెల 28వ తేదీ వరకు జరుగుతుందని.. కావున ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్లు, ప్రత్యేక ఉపాధ్యాయులందరూ మొబైల్‌లోని ప్లే స్టోర్ నుంచి ప్రశస్త్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ యాప్‌లో 21 రకాల వైకల్యాలు గల ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించేందుకు వీలుగా 64 ప్రశ్నలను పొందుపరిచారన్నారు. ప్రశస్త్ యాప్‌లో నమోదైన ప్రత్యేక అవసరాల గల పిల్లలకు తగిన వైద్య సేవలు, సహాయక చర్యలు, సేవలు, సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కావున ప్రతి ఒక్క దివ్యాంగ విద్యార్థిని గుర్తించి యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు యశోధ, సుజాత, సీఆర్పీ సూర్యకుమారి, పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించండి

పులివెందుల టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీఆర్‌ఏల రెవెన్యూ సంఘ డివిజన్ అధ్యక్షుడు గంగాధర కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏలతో కలిసి ఆందోళన చేపట్టారు. తమ డిమాండ్ల సాధన కోసం ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు ఆందోళన చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల మండల అధ్యక్షుడు బయన్న, రాజు, ప్రభాకర్, కోశాధికారి మునిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలి

కమలాపురం : రైతులు సాగు చేసిన పంట పొలాలను సందర్శించి ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలని ఏడీఏ ఏవీ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఏడీఏ కార్యాలయంలో కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఆర్‌బీకే ఇన్‌చార్జిలకు ఈ-క్రాప్ బుకింగ్ యాప్ పై శిక్షణ నిచ్చారు. ఈ క్రాప్ ఆఫ్ టెక్నికల్ పర్సన్ వినోద్ ఆచారి ఈ-క్రాప్ బుకింగ్ యాప్ గురించి వీడియో ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తూ అవగాహన కల్పించారు. అంతకు ముందు ఏడీఏ మాట్లాడుతూ ఏ మాత్రం అవినీతికి ఆస్కారం లేకుండా ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలన్నారు. తాము ఈ-క్రాప్ బుకింగ్ చేయాల్సిన సర్వే నెంబర్‌లోకి వెళ్లి ఆన్ చేస్తేనే మొబైల్ కెమెరా ఆన్ అవుతుందని, అపుడు మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ చేయాలని సూచించారు. సర్వే నెంబర్‌కు కొంత దూరంలో ఉన్నా కెమెరా ఆన్ కాదన్నారు. రైతు ఒక చోట ఉండి మరో చోట ఈ-క్రాప్ బుకింగ్ చేయాలంటే కుదరదన్నారు. సాంకేతికతను జోడించి ఈ సారి ఈ-క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి తరుణంలో అవినీతికి పాల్పడే ఛాన్స్ లేదన్నారు. అలాగే పంట ఎక్కడైతే సాగులో ఉందో అక్కడికి తప్పనిసరిగా వెళ్లి క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అలాగే శనివారం మండల స్థాయిలో ఏఓల ఆధ్వర్యంలో కూడా శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీఏఏ, వీఆర్‌ఓ, సర్వేయర్‌ల బృందం వెళ్లి క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇన్సూరెన్స్, క్రాప్ బుకింగ్, సున్నా వడ్డీ పంట రుణాలు, కనీస మద్దతు ధర ఇలా అన్ని రకాల పథకాలకు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి అన్నారు. పీఎం కిసాన్ 14వ విడత డబ్బులు పడాలంటే ఈకేవైసీ తప్పని సరిగా చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు సరస్వతి, సాయిజ్యోతి, సంతోషిని, శ్రీకాంత్‌రెడ్డి, ఏఈఓ దస్తగిరి, డివిజన్ పరిధిలోని ఆర్‌బీకే అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న అర్బన్ సీఐ రాజు

పులివెందుల : హిందు, ముస్లింలు పవిత్రంగా జరుపుకునే మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని అర్బన్ సీఐ రాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పండుగల సమయంలో, ఇతర సందర్భాలలో పులివెందులలోని హిందు, ముస్లింల మధ్య ఎటువంటి సమస్యలు తలెత్తలేదని, ఈ బంధం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. మండల పరిధిలో ఏవైనా సమమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ, ఏఎస్‌ఐ స్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963 170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఎన్‌సీసీ కోర్సుతో క్రమశిక్షణ


మాట్లాడుతున్న హెడ్మాస్టర్ శివ నాగమునెమ్మ

వేంపల్లె : విద్యార్థి దశ నుంచి ఎన్‌సీసీతో శిక్షణ అలవరుచుకోవాలని ఎన్‌సీసీ ఆఫీసర్ సీఓ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా తెలిపారు. గురువారం వేంపల్లె తలిశెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో 8వ తరగతి విద్యార్థుల కు ఎన్‌సీసీ జాతీయ క్యాడెట్ కార్ప్స్ ఎంపికలు నిర్వహించారు. హెడ్మాస్టర్ శివ నాగమునెమ్మ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ అశోక్ కుమార్, హవల్దార్ సందీప్ కుమార్ సింగ్ కౌర్, పాఠశాల సీపీఓ గోపాల్ నాయక్‌లతో కలిసి 50 మంది ఎన్‌సీసీ క్యాడెటర్లు, 8 మంది రిజర్వ్ క్యాడెటర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ దేశానికి సేవ చేసే భాగ్యం ఈ కార్యక్రమం ద్వారా రావడం విద్యార్థులు చేసుకున్న అదృష్టంగా భావించాలన్నారు. అంతేకాక సేవా కార్యక్రమాల ద్వారా లభించే సర్టిఫికెట్‌వల్ల విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ కూడా వరిస్తాయని.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యను అభ్యసించడం ప్రతి పౌరుడి హక్కు

కమలాపురం : అనాగరికత, మూఢ నమ్మకాల నుంచి మన జీవితాలను బయటపడేసే ఒకే ఒక ఆయుధం విద్య అని, విద్య అభ్యసించడం ప్రతి పౌరుడి హక్కు అని ముఫ్తీ అబ్దుల్ హాది సాహెబ్ తెలిపారు. గురువారం స్థానిక కుమ్మరవీధిలోని తాళింలో ఖాజీ సయ్యద్ హుసేన్ బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదరసా-ఏ-షహమీరియా తాలిముల్ ఖురాన్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ వేడుకలను ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ముస్లిం సమాజంలో విద్యా విధానాన్ని పెంపొందించ డమే ధ్యేయంగా ఈ తాలిముల్ ఖురాన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ముఖ్యంగా ఇప్పటికే చాలా మంది మూఢ నమ్మకాలలో మునిగి తేలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి కోసం విద్య అనే ఆయుధం తప్పనిసరిగా వారికి అందించాలన్న దృఢ సంకల్పంతోనే ఈ మదరసా-ఏ-షహమీరియాను సయ్యద్ హుసేన్ బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

మదరసా నిర్వాహకులు హాఫిజ్ జాహిద్ హుసేన్, హాఫిజ్ గయాసుద్దీన్, హాఫిజ్ షాహుల్ హమీద్, హాఫిజ్ కరీముల్లా, మౌలానా అక్మల్ పీరా సాహెబ్ తదితరులు మాట్లాడారు.

ఓటర్ల నమోదులో అభ్యంతరాలు ఉంటే తెలపండి


ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్షిస్తున్న ఆర్డీఓ వెంకటేశులు

పులివెందుల టౌన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు ప్రక్రియలో అభ్యంతరాలు ఉంటే అన్ని రాజకీయ పార్టీల నాయకులు తెలియజేయాలని పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు కోరారు. గురువారం స్థానిక ఆర్డీ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆగస్టు 1వ తేదీ నుంచి బీఎల్‌ఓలు ఓటర్ల నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని చేపడతారన్నారు. వారికి అనుసంధానంగా బూత్‌లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసి అక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసేందుకు వీలవుతుందన్నారు. అందుకు ప్రతి రాజకీయ పార్టీ సహకరించాలన్నారు. వచ్చే ఎన్నికల వరకు బీఎల్‌లు, బీఎల్‌ఏలు కలిసి ఓటరు నమోదు ప్రక్రియ కార్యక్రమంలో పాల్గొని యాప్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చూసేందుకు వీలవుతుందన్నారు. వీటిపై ఎలాంటి సందేహం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏడు మండలాలకు సంబంధించి 2,23,420 ఓటర్లు ఉండగా.. అందులో అదనంగా 2547 మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. 5127 మంది చనిపోయిన వారిని గుర్తించి తొలగించామన్నారు. అలాగే 815 మంది షిఫ్ట్ కాగా.. 323 డబుల్ ఎంట్రీలను గుర్తించి తొలగించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కాంగ్రెస్, టీడీపీ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : ఓటర్ల తుది జాబితాపై ఎలాంటి అపోహలు, అనుమానాలు ఉన్న తమ దృష్టికి తీసుకవస్తే వాటిని సరిచేస్తామని ఆర్‌ఓ చంద్రమోహన్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో జరిగిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ అందరి సహకారంతో ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు, తప్పొప్పులు లేకుండా సరిచేస్తామన్నారు. అక్టోబర్ 10వ తేదీన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని, అందులో అర్హులుగా ఉండి ఓట్లు తొలగించినట్లు మీ దృష్టికి వస్తే తమకు తెలియజేయాలన్నారు. ఇప్పటికే 4845 ఓట్లు తొలగించామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్‌సీ పుల్లారెడ్డి ఓటు ఒక వార్డులో ఉండి, పోలింగ్ బూత్ చాలా దూరంలో ఉన్నట్లు ఉన్నాయని ఆర్‌ఓ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆర్‌ఓ అలాంటి ఓట్లు ఎన్ని ఉన్నాయో తెలియజేస్తే సమీపంలోని పోలింగ్ కేంద్రంలో వారికి ఓట్లు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2024 జనవరి 5న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

మీనాకుమారికి డాక్టరేట్

ఎర్రగుంట్ల : పట్టణంకు చెందిన బొజ్జ మహేశ్వరరెడ్డి సతీమణి జీ మీనాకుమారి జువాలజీ సబ్జక్టులో పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించింది. ఎస్వీ యూనివర్శిటీ ఎంఎస్‌సీ పూర్తి చేసిన ఆమె అక్కడే జువాలజీ సబ్జక్టులో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ సాధించింది. ప్రస్తుతం ఆమె గుంతకల్లులోని డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తుంది.